క్లుప్తంగా

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి


సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎస్బీఐ సర్కిల్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

బోట్‌క్లబ్: బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థకు మంచి గుర్తింపు వచ్చేలా ఉద్యోగులంతా కృషి చేయాలని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ అమరావతి సర్కిల్ అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కృషి భవన్‌లో ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యూనియన్ కాకినాడ రీజియన్ సమావేశం జరిగింది. ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ బ్యాంకును లాభాల్లో నడిపించాలని సిబ్బందిని కోరారు. ఉద్యోగుల సమస్యలను యాజమాన్యానికి వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ సెక్రటరీ చంద్రశేఖర్, సభ్యులు పాపారావు, పేరి శాస్త్రి, లక్ష్మి, రాంకుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి బాసట


శివప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కరప: మనతో ఉన్నా, కాలం చేసినా స్నేహితుడు స్నేహితుడే. గ్రామానికి చెందిన కొవ్వూరి శివప్రసాద్ స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదో తరగతి చదివాడు. అనారోగ్యంతో అతడు మృతి చెందడంతో సహ విద్యార్థులు అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తెలుసుకుని రూ.లక్ష సేకరించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ద్వారా తమ స్నేహితుడి భార్య, కుమార్తెలకు ఆదివారం కరప హైస్కూల్‌లో అందజేశారు.

చలివేంద్రం ఏర్పాటు


మజ్జిగ పంపిణీ చేస్తున్న టౌన్‌హాల్ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు జీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి పాబోలు చినపుల్లయ్య ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ చలివేంద్రం నిర్వహించేలా సిబ్బందిని నియమించినట్టు మూర్తి తెలిపారు. కార్యదర్శి మాట్లాడుతూ రెండు నెలల పాటు ఈ చలివేంద్రం నిర్వహిస్తామన్నారు. తొలి రోజు సభ్యులు బచ్చు శివప్రసాద్ 5 వేల లీటర్ల మజ్జిగ అందించారన్నారు. కమిటీ ఉపాధ్యక్షులు జీవై రఘునాథ్, సంయుక్త కార్యదర్శి వీవీ సుబ్రమణ్యేశ్వరావు, ఎం.సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న రాఘవేంద్రన్ తదితరులు

కాకినాడ కల్చరల్: అపరిష్కృతంగా ఉన్న పోస్టల్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత తపాలా పెన్షనర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు కె.రాఘవేంద్రన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ నాలుగో ద్వైవార్షికోత్సవ సభ అసోసియేషన్ కాకినాడ డివిజన్ అధ్యక్షులు టి.గాలిబ్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. డీఏ బకాయి వెంటనే చెల్లించాలని, ఫిక్స్‌డ్ మెడికల్ అలవెన్స్‌ను మూడు వేలకు పెంచాలని డివిజన్ కార్యదర్శి తురగా సూర్యారావు డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని అసోసియేషన్ నాయకులు ఎన్.నాగేశ్వరావు, ఎం.ఉమామహేశ్వరావు అన్నారు.

సంస్కృతికి చిహ్నాలు జాతరలు

పిఠాపురం: ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే అమ్మవారి జాతరలు మన సంస్కృతికి చిహ్నాలని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ఆదివారం గొల్లప్రోలు మండలం దుర్గాడలో గరగనెత్తుకుని వేగుళ్లమ్మ అమ్మవారి జాతరను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామానికి మూల విరాట్టుగా ఉంటారన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారి గరగను శిరస్సున ధరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 20 వరకు నిర్వహించనున్న అమ్మవారి జాతర వైభవంగా జరిగేలా ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

టీడీపీ నాయకుల ప్రచారం


కరప: మండలం కొంగోడులో ఆదివారం టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇదేం ఖర్మ, మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంటింటికి కరపత్రాలు పంచారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆశలన్నీ చివరి దశపైనే!

- రబీ దిగుబడిపై అన్నదాత చూపు
- తొలుత భయపడినా తుదకు సవ్యం
- నియోజకవర్గంలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు


పాలు పోసుకునే దశలో ఉన్న లేతచేలు


పక్వదశలో ముందుగా ఊడ్చిన రబీపంట



(అంతర చిత్రం) రబీ ధాన్యం కొనుగోలుకు విడుదల చేసిన కరపత్రం

కరప: మండలంలోని రబీ ఆశాజనకంగా ఉంది. వాతావరం అనుకూలించి పంట బాగుందని, మరో రెండు, మూడు వారాలు భగవంతుడు కరుణిస్తే పంట చేతికి అందుతుందని రైతులు ఆశాభావంతో ఉన్నారు. దాళ్వా ఆరంభంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా కోటి ఆశలతో రబీ సాగు చేశారు. మెరక ప్రాంతాల్లో, కాలువ శివారుల్లో సాగు ఆలస్యమైంది. ప్రారంభంలో సాగునీటితో కరప, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, కూరాడ, వాకాడ, వలసపాకల, పెద్దాపురప్పాడు, కొంగోడు, వేములవాడ తదితర గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇరిగేషన్ అధికారులను అప్రమత్తం చేసి, సాగునీరందించేందుకు కలెక్టర్ కృత్తికాశుక్లాతో సంప్రదించి, నాయకులు, అధికారులను సమన్వయం చేశారు. గ్రామ, మండల కమిటీల పర్యవేక్షణలో సాగునీరందించేందుకు వంతులవారీ విధానం అమలుచేశారు. మండల పరిధిలో కరప, వేములవాడ, పెద్దాపురప్పాడు, కూరాడ తదితర గ్రామాల్లో డ్రెయిన్లపై అడ్డుకట్టలు వేయించారు, చినమామిడాడ వద్ద డ్రెయిన్‌లో నీరు ఇంజిన్లతో తోడించారు. దీంతో సాగునీటి ఎద్దడి గట్టెక్కడంతో సిరులు పండుతున్నాయని రైతులు అంటున్నారు. మండలంలో సుమారు 14,443 ఎకరాల్లో వరిసాగుచేశారు. ఎంటీయూ 1121 (శ్రీధృతి) 520 ఎకరాల్లో సాగుచేశారు. అధికారులు వద్దన్నా పంట బాగుంటుందని రైతులు ఎంటీయూ–3626 (బొండాలు) 13,923 ఎకరాల్లో సాగుచేశారు. బొండాలు రకాన్ని కూడా ఆర్‌బీకేల ద్వారా మద్దతుధరకు కొనుగోలు చేసేందుకు సీఎం జగన్ కేంద్రంతో సంప్రదించారని, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తారని ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు. ఎకరానికి ఇంతవరకు రూ.30 వేల వరకు పెట్టుబడులు అయినట్టు రైతులు అంటున్నారు. కూలీ రేట్ల నుంచి ఎరువులు, పురుగుమందుల వరకు ధరలు పెరిగిపోవడంతో సాగు వ్యయం బాగా పెరిగిందంటున్నారు. ముందుగా ఊడ్చిన వరిచేలు పక్వ దశలోను, లేత చేలు పాలు పోసుకుని, గింజ గట్టిపడే దశలోను ఉన్నాయి. వాతావరణం మరో రెండు వారాలు అనుకూలించి దోమపోటు వంటి పంటతెగుళ్ల ఆశించకపోతే ఎకరానికి 40 నుంచి 50 బస్తాల దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు. వాతావరణం అనుకూలించి, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించాలని వారు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు.

వరికోతలు ప్రారంభం

మండల పరిధిలో ముందుగా ఊడ్చిన పొలాల్లో వరిచేలు పక్వదశకు చేరుకోగా కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రంతో కోయించడానికి ఎకరాకు సుమారు రూ.3.500 దాకా ఖర్చవుతుండగా మనుషులతో కోయించడానికి మగవారికి రూ.900, మహిళకు రూ.400 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు. గొర్రిపూడిలో కోతలు ప్రారంభించారు. నాలుగైదు రోజుల్లో మిగిలిన గ్రామాల్లో ప్రారంభంకానున్నాయి.

20 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



పంటకు మద్దతు ధర అందించేందుకు నియోజకవర్గ పరిధిలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా కరప మండలంలోని 20 ఆర్‌బీకేలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. సాధారణ రకమైతే 75 కిలోల బస్తాకు రూ.1,530, గ్రేడ్–ఎ రకమైతే రూ.1,545 మద్దతు ధర అందిస్తారు. మెషీన్‌తో కోయించుకుంటే పెట్టుబడి ఖర్చు ఎకరానికి రూ.నాలుగైదు వేలు తగ్గుతుంది. రబీ కోతలకు నాలుగైదు రోజుల ముందు అపరాల విత్తనాలు చల్లుకోవాలి. పండితే అదనపు ఆదాయం వస్తుందని, వాతావరణం అనుకూలించకపోతే అపరాల మొక్కలతో భూమి సారవంతమవుతుంది.

– ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప

అల్లా దయతో మరింత అభివృద్ధి

ఇఫ్తార్ విందులో ద్వారంపూడి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అల్లా అనుగ్రహంతో ముస్లింలు మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక జగన్నాథపురంలోని మస్జిద్–ఎ–అజామ్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ద్వారంపూడి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. మసీదు అధ్యక్షుడు అతహర్‌ఖాన్ దుర్రానీ, ఉపాధ్యక్షుడు బహుద్దూర్, కార్యదర్శి హుస్సేన్, మైనార్టీ సెల్ ప్రాంతీయ సమన్వయ కర్త అబ్దుల్ బషీరుద్దీన్, ప్రభుత్వ ఖాజీ గౌస్ మోహిద్దీన్, ముస్లిం ప్రముఖులు ఇక్బాల్ ఆలీ, రెహ్మాన్‌ఖాన్, ఖాలీద్ బిన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ

కాకినాడ: రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జమ్మలమడక నాగమణి ఆదివారం పలువురు ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసారు. కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, రాష్ట్ర సివిల్ సప్ల యిస్ కార్పొరేషన్ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర రైసుమిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి తదితరులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి


క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు షీల్డు, క్యాలెండర్ అందజేస్తున్న డాక్టర్ అన్నవరం

కరప: మండలం వేళంగిలో ఆదివారం రమ్య చారిటబుల్ ట్రస్ట్, రమ్య హాస్పటల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ పితాని అన్నవరం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా క్రికెట్, వాలీబాల్ టోర్నీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది పేదలకు దుస్తులు, క్రికెట్, వాలీబాల్ టోర్నీల విన్నర్స్, రన్నర్స్ జట్లకు డాక్టర్ అన్నవరం బహుమతులు అందజేశారు. వేళంగి గ్రాడ్యుయేట్ ప్రతనిధులు దేగల శ్రీనివాస్, ఎర్రా విక్రం, ముడుగు జనార్దన్, పట్టా రాజేష్, ఉడా నరేష్, చుట్టూరి అప్పన్న, ముడుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రమ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అన్నవరంను గ్రాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

కందుకూరి సేవలు స్ఫూర్తిదాయకం

- కళాకారులకు పురస్కారాలు
- ఉత్సాహంగా నాటక దినోత్సవం


కళాకారులకు కందుకూరి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరిస్తున్న వేదిక ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు తదితరులు

కాకినాడ కల్చరల్: సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం సేవలు స్ఫూర్తిదాయకమని సమాజ సేవకులు, పీఆర్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని విశ్రాంత ఉద్యోగుల భవనం సమావేశ మందిరంలో సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తెలుగు నాటక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు కందుకూరి చేసిన సేవలను కొనియాడారు. ఏటా కందుకూరి జయంతిని తెలుగు నాటక దినోత్సవంగా జరుపుకుంటున్నామని వేదిక ప్రదాన కార్యదర్శి పంపన దయానందబాబు అన్నారు. అనంతరం రంగస్థల కళాకారిణి సాలూరి శివజ్యోతి, గాయకులు ఎస్.శ్రీ రామచంద్రమూర్తి, పౌరాణిక రంగస్థల కళాకారుడు గొల్లపల్లి వీరవెంకట సత్యసర్వేశ్వరావులకు కందుకూరి విశిష్ట పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం రంగస్థల అలంకరణ మయబ్రహ్మ తుంపాల బాబురావుకు ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముందు స్మారక కళావేదిక 39వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహించి కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. వేదిక గౌరవ అధ్యక్షుడిగా కర్రి భామిరెడ్డిని, అధ్యక్షులుగా కర్రి అచ్చుత రామారెడ్డిని, ప్రదాన కార్యదర్శిగా పంపన దయానందబాబును, ఉపాధ్యక్షులుగా ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, ఎం.బాలప్రకాష్, ఎస్‌వీఆర్ బాపిరాజులను ఎన్నుకొన్నారు. ఈకార్యక్రమానికి వేదిక సభ్యులు హాజరయ్యారు.

కందుకూరి ఆదర్శప్రాయుడు

కాకినాడ కల్చరల్: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజసేవ చేయాలని సంఘ సేవకుడు పేరపు నాగగౌతమ్ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో బ్రహ్మధ్యాన సత్సంగ్ జాతీయ అధ్యక్షుడు మణికంఠ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కందుకూరి జయంతి నిర్వహించారు. యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని వక్త కాకి సూర్యనారాయణ అన్నారు. సత్సంగ్ జిల్లా అధ్యక్షుడు దండుప్రోలు మహేష్, లక్ష్మి సౌజన్య, ఆనంద్, వీరబాబు, వరదా సురేష్, నూకరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న రాయబారం

స్థానిక ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ దంటు కళాక్షేత్రంలో క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు నాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. కురుక్షేత్ర యుద్ధంలో తమ పక్షం వహించాల్సిందిగా కృష్ణుని కోరడానికి అర్జునుడు, దుర్యోధనుడు వచ్చిన సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణుడిగా వి.రామకృష్ణ, అర్జునుడిగా డీఎస్‌పీ రావు, దుర్యోధనుడిగా అమీర్ చక్కని ప్రదర్శన చేశారు. అనంతరం ప్రదర్శించిన దుర్యోధనుని ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది.


కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మణికంఠస్వామి తదితరులు


రాయబారం నాటకంలో ఒక సన్నివేశం

'రాగిరెడ్డి' సేవలు ఎనలేనివి


కాకినాడ జీజీహెచ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, చంద్రకళాదీప్తి, శివప్రసన్న తదితరులు

- ఎంపీ వంగా గీత
- జీజీహెచ్‌లో చలివేంద్రం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: పది మందికీ ప్రయోజనం కలిగేలా రాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎంపీ వంగా గీత అన్నారు. ఆర్‌విజీఆర్ కుమార్ (ఫ్రూటీ కుమార్) ట్రస్టు ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డితో కలసి ఆదివారం ప్రారంభించారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి వేలాదిగా వచ్చే రోగుల సౌకర్యార్థం రాగిరెడ్డి ట్రస్ట్ ఏటా ఇక్కడ చలివేంద్రాన్ని నిర్వహిస్తోంది. ఎంపీ గీత మాట్లాడుతూ దివంగత కుమార్ కాకినాడలో పార్టీకి, ప్రజలకు ఎనలేని సేవలందించారని, ఆయన స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ నిత్యం ప్రజా సేవలో తరించే ఫ్రూటీ కుమార్ పేరు కాకినాడలో చిరస్థాయిగా ఉండేలా ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ట్రస్టు ప్రతినిధి బన్నీ మాట్లాడుతూ వేసవి ఉన్నంత వరకూ నిత్యం ఐదువేల మందికి అవసరమైన మజ్జిగను సరఫరా చేస్తామన్నారు. వీటితో పాటు ట్రస్టు ద్వారా చిన్నారులకు కంటి వైద్యశిబిరాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మహాలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు చేసిన సాయం వృథా కాదు


సహాయం చేస్తున్న రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: విద్యకు చేసిన సహాయం వృథా కాదని రెడ్ కాన్వెంట్ పూర్వవిద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం రూ.1.75 లక్షల విలువైన సైకిళ్లు, మందులు అందజేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థి శ్రీరామ్‌కు రూ.50వేలు, బీబీఏ విద్యార్థి భువనేశ్వరికి రూ.25వేలు, నర్సింగ్ విద్యార్థి దాక్షాయణికి రూ.20 వేలు, ఫార్మా–డి విద్యార్థి శౌప్రియకు రూ.25 వేలతో పాటు ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న నాగేంద్రకు రూ.18వేలు విలువగల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ సీమకుర్తి పాపారావు, కల్యాణి, సుజాత, మధుసూదన్, పద్మనాభం పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కొవ్వాడలో గడప గడపకూ..


కొవ్వాడలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని కొవ్వాడ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి వివరాలు తెలియజేసి, అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్నారన్నారు. మహిళలు, పేద ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి డీబీటీ ద్వారా వారి ఖాతాలకు వేయడంతో ఎక్కువ అవకతవకలకు అవకాశం లేదన్నారు. ప్రజలు సంతోషంతో ఉన్నారని, మరో సారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వచనాలు అందివ్వాలని ఆయన కొవ్వాడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, ఉప సర్పంచ్ తోటకూర శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనమ్మ తీర్థం


ధనమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: గ్రామంలోని అగ్నికుల క్షత్రియుల కులదేవత ధనమ్మతల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారం రోజులు ముందే అమ్మవారి ప్రతిరూపమైన గరగలను ఊరేగించారు. శనివారం రాత్రి తెల్లవార్లు గరగ నృత్యాలు, గారడీ, డప్పు వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించారు. అగ్నికుల క్షత్రియులతో పాటు గ్రామస్తులు వచ్చి ధనమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సాదే లోహిదాస్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి

కాకినాడ: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వ, సేవా సంస్థలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక కొండయ్యపాలెం మహాత్మవీధిలో 55 మంది మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ ఆదివారంతో ముగిసింది. రాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, నెహ్రూ యువకేంద్రం, మైత్రేయి సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు వీరికి టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిక్షణ సమయంలో బేకరీ మేకింగ్, కొవ్వొత్తుల తయారీ, యోగాపై కూడా అవగాహన సదస్సులు నిర్వహించినట్టు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు జీవితంలో స్థిరపడేలా తమ వంతు తోడ్పాటు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైత్రేయి అధ్యక్షురాలు సీహెచ్ సుశీ, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, ట్రైనర్ రమణి పాల్గొన్నారు.

టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లిన కారు

పిఠాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని ఒక కారు అదుపుతప్పి టోల్‌గేట్‌లోకి దూసుకువెళ్లింది. ఆదివారం గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద తాటిపర్తి నుంచి పిఠాపురం వస్తున్న ఒక కారును పిఠాపురం వైపు నుంచి గొల్లప్రోలు వైపు వెళుతున్న మరో కారు ఢీకొట్టి ఈ ఘటన జరిగింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.


అదుపు తప్పి టోల్‌గేట్‌లోకి దూసుకెళ్లిన కారు